వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## బిజెపి, జనసేన, టీడీపీ కలిసి పనిచేసి జగన్ ప్రభుత్వాన్నీ గద్దె దించుతాము.

కడప నగరంలోని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డి






## ఎన్నికల షెడ్యూల్ విడుదల

### ఏప్రిల్ 25న నామినేషన్లు పోలింగ్ మే 13 అమల్లోకి ఎన్నికల నియమావళి

కడప ప్రభాతవార్తబ్యూరో మార్చి 16

సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు శనివారం వెలువడింది. కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూలును ప్రకటించింది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని రెండు పార్లమెంట్, 13 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ 25న నామినేషన్ల ప్ర క్రియ, 29న ఉపసంహారణ ఉంటుంది. మే 13న పోలింగ్ నిర్వహించి జూన్ 4వతేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు. కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలకు, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూలు వెలువడిన వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎన్నికల నియమావళిని ప్రకటించారు. ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల తనిఖీలు వంటి కార్యక్రమాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. మొదటి విడతలో ఎన్నికలు జరగనున్నాయి.

# కష్టపడదాం.. ఫలితం సాధిద్దాం

### - ఇడుపులపాయలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల చేసిన సీఎం జగన్

వేంపల్లె, మార్చి 16, ప్రభాతవార్త ః

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కష్టపడి.. ప్రభుత్వాన్నిఏర్పాటు చేసి ఫలితం సాధిద్దామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇడుపులపాయలో శనివారం మధ్యాహ్నం దివంగత నేత వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఆయన వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. 175 అసెంబ్లీ, 24 ఎంపీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను మంత్రి ధర్మానప్రసాదరావు, ఎంపీ అభ్యర్థుల పేర్లను ఎంపీ నందిగామ సురేష్‌లు వెల్లడించారు. అయితే ఒక అనకాపల్లె పార్లమెంట్ స్థానానికి అభ్యర్థిని పెండింగ్‌లో ఉంచారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు అంజాద్‌బాషా, నారాయణస్వామి, మంత్రి తానేటి వనిత, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, రఘురామిరెడ్డి, గడికోట శ్రీకాంత్, సుధ, శ్రీనివాసులు, వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, సర్పంచి రాచనేని శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



# వైసిపి అభ్యర్థుల జాబితా విడుదల

### 175 అసెంబ్లీ, 24 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన



కడప ప్రభాతవార్తబ్యూరో మార్చి 16

సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేయనున్న వైఎస్ఆర్ సిపి అభ్యర్థుల జాబితాను శనివారం ఇడుపాయలో విడుదల చేశారు. మధ్యాహ్నం 12.50గంటలకు వైఎస్ఆర్ సమాధి వద్ద జాబితాను ఉంచి ప్రత్యేక ప్రార్థనల అనంతరం అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ముఖ్యమంత్రి వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రకటించగా, ఎంపీ అభ్యర్థులను ఎంపీ నందిగం సురేష్ ప్రకటించారు. కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలకు సిట్టింగ్ ఎంపీలు వైయస్ అవినాష్‌రెడ్డి, పి. మిథున్‌రెడ్డిలను ప్రకటించారు. కడప అసెంబ్లీకి ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, బద్వేల్‌కు డాక్టర్ దాసరి సుధ, మైదుకూరుకు ఎం. రఘురామిరెడ్డి, ప్రొద్దుటూరుకు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, జమ్మలమడుగు డాక్టర్. పి. సుధీర్‌రెడ్డి, పులివెందులకు వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి, కమలాపురానికి పి. రవీంద్రనాథ్‌రెడ్డి, రాజంపేటకు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రైల్వేకోడూరుకు కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటికి గడికోట శ్రీకాంతరెడ్డి, పీలేరుకు చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లికి నిసార్ అహమ్మద్, తంబళ్లపల్లికి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల పేర్లను వెల్లడించారు. రాజంపేట, మదనపల్లి మినహాయించి మిగిలిన అన్ని స్థానాల్లో పాతవారికే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు నారాయణస్వామి, అంజాద్‌బాష, ఎంపీ మిథున్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొన్నారు.

## యువత ఓటుతోనే దేశ భవిష్యత్తు

### సైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమాలలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



పీలేరు, మార్చి 16 ప్రభాతవార్తః

జిల్లాలోని జేఎన్‌ఈయూ కలికిరి భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూయువ కేంద్ర మరియు జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్‌ఇంజినీరింగ్ కలికిరి సంయుక్త ఆధ్వర్యంలో సైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమంలో జేఎన్‌టీయూ కళాశాల ఆడిటోరియం నందు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## జగన్‌కు మరో అవకాశం ఇవ్వండి..

### మరింత మెరుగైన పాలన, మేలు అందుతుంది

### - 4వ విడత వైఎస్ఆర్ చేయూత, 3వ విడత ఈబీసీ నేస్తంలో ఎంపీ, ఎమ్మెల్యే



రాయచోటి గ్రామీణ, మార్చి 16, ప్రభాతవార్త:

ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చి మాట మీద నిలబడిన వ్యక్తిగా పేరొందారని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. శనివారం రాయచోటిలో జరిగిన నియోజకవర్గ స్థాయి వైఎస్ఆర్ చేయూత 4వ విడత సదస్సు మరియు 3వ విడత ఈబీసీ నేస్తం సదస్సును సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ చంద్రబాబు గత 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చక మాట తప్పిన నాయకుడని అలాంటి వ్యక్తిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జగనన్న పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన నాయకుడు జగన్ అని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో జగన్ను సీఎం చేసి మరింత అభివృద్ధి, మెరుగైన పాలన, మేలు జరుగుతుందన్నారు. వైఎస్ఆర్ చేయూత 4వ విడత రాయచోటి నియోజకవర్గానికి సంబంధించి 4వ విడతలో రూ.27.99 కోట్లు, ఈబీసీ నేస్తం లబ్ధి రూ.5.25 కోట్లు మెగా చెక్కులను ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ కార్యక్రమంలోఅధికారులు,వైసీపీనాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### సీఏఏ బిల్లును వ్యతిరేకిస్తూ

## కడపలో భారీ ర్యాలీ

కడప వైద్యవిభాగం,
మార్చి 16, ప్రభాతవార్త:



కడప నగరంలోని అల్మాస్‌పేట సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ చిలకలబావి, రెండో గాంధీ బొమ్మ, వన్‌టన్ సర్కిల్, గోకుల్ సర్కిల్, సెవెన్ రోడ్స్ సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం హిందూ ముస్లిం భాయ్ భాయ్, కేంద్ర ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ భారతదేశంలో ఉండే ముస్లింలపైన బీజేపీ ప్రభుత్వం టార్గెట్ చేస్తుందని మండిపడ్డారు. భారతదేశంలో ఉండే ముస్లింలపైన బీజేపీ ప్రభుత్వం టార్గెట్ చేస్తుందని మండిపడ్డారు. అధికారం చేతిలో ఉందని బీజేపీ నల్ల చట్టాలు అమలు చేయడం సరికాదన్నారు. ఈ ర్యాలీలో భారీగా వామపక్ష పార్టీల నాయకులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## వైకాపా అధికారంలోకి వస్తే భూ కబ్జాలే

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె, మార్చి 16 ప్రభాతవార్త :

వైకాపా మళ్ళీ అధికారంలోకి వస్తే భూ కబ్జాలతో పాటు సొంత ఆస్థులను రాసుకొంటారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం కార్యకర్తల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ వైకాపా పాలనలో రాష్ట్రం అభివృద్దిలో 30ఏళ్ళు వెనుకబడిందన్నారు. మళ్ళీ వైకాపానే వస్తే భూకబ్జాలతో పాటు దౌర్జన్యాలు అధికం అవుతాయన్నారు. మదనపల్లెను జిల్లా ప్రకటించకుండా అడ్డుకొన్న పెద్దిరెడ్డి కుటుంబానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఎంపి అభ్యర్థి మిథున్‌రెడ్డిని ఓడిస్తేనే రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాలన్ని అభివృద్ధి చెందుతుందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన నెలలోనే మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అన్నమయ్యజిల్లా అభివృద్ధిని పిఎల్ఆర్ కుటుంబం అన్ని విధాల అడ్డుకోందన్నారను. వారి దౌర్జన్య పాలనకు చమరగీతం పాడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును గెలిపించాల న్నారు. అనంతరం వైకాపా నుంచి పెద్దసంఖ్యలో టిడిపి కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, టిడిపి నాయకులు ఎస్ఎ.మస్తాన్, నీలకంఠ, మాజీ కౌన్సిలర్ బాబునాయుడు, రాధా, పులిమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా వ్యాప్తంగా 3వేల కేసులు పరిష్కారం

కడప లీగల్, మార్చి 16, ప్రభాతవార్త:

జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగింది. కడపలో 6, ప్రొద్దుటూరు 4, రాజంపేట 1, రాయచోటి 3, బద్వేలు 2, పులివెందుల, కమలా పురం, జమ్మల మడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూ రు, సిద్దవటం, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కొక్క బెంచీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి, శ్రీదేవి మాట్లాడుతూ కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాంప్రసాద్‌రెడ్డికి అండగా మైనార్టీ సోదరులు

### స్వచ్ఛంధంగా సంఘీభావం తెలుపుతున్న మైనార్టీ మహిళలు

### - అవకాశం ఇవ్వండి రుణం తీర్చుకుంటా

### - టిడిపి అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 16, ప్రభాత వార్త :

రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి రోజు రోజుకూ మైనార్టీ సోదరా సోదరీమణులు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సంఘీభావం తెలుపుతూ అండగా నిలుస్తామని తెలియజేస్తున్నట్లు రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణంలోని 5వ వార్డులో వైసిపికి చెందిన మైనార్టీ మహిళలు



దాదాపు 350 మంది సలావుద్దీన్, మాజీ మార్కెట్ ఛైర్మన్ అన్వర్‌బాషా, జాఫర్‌ల ఆధ్వర్యంలో రాంప్రసాద్‌రెడ్డి కండువా వేసి కార్యకర్తలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తాను గెలిచిన వెంటనే కొత్తపల్లెకు ప్రత్యేక నిధులు కేటాయించి అన్ని అంగులతో అన్ని మౌళిక వసతులతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దే విధంగా చేస్తానని, అందరికీ అందుబాటులో ఉంటానని కార్యకర్తలను భరోసా ఇచ్చారు. వైసిపి హయాంలో కొత్తపల్లికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకోవడం, తర్వాత మమ్మల్ని పట్టించుకోవడం లేదని పలువురు రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. మండిపల్లి కుటుంబం మైనార్టీలతో కొన్ని సంవత్సరాలుగా అనుబంధం అప్యాయతలతో కలిసి ఉందని, తాను కూడా అందరికీ అందుబాటులో ఉంటూ దాదాపు 20 సంవత్సరాలుగా రాయచోటి ప్రజల కోసం పని చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా మూడు రోజులకు ఒకసారి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని రాంప్రసాద్‌రెడ్డి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## భూపేష్ అన్నతోనే జమ్మలమడుగు అభివృద్ధి

జమ్మలమడుగు, మార్చి 16, ప్రభాతవార్త: జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించాలని యువ నాయకులు లోకేష్ మరియు రవీంద్ర అహోబిలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూపేష్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నిరంతరం ప్రజలతోనే ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్న భూపేష్ ఈ సార్వత్రిక ఎన్నికల్లో గెలిస్తేనే జమ్మలమడుగు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని నరసింహస్వామి ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు చేశామని వారు చెప్పారు.

## అరాచక పాలనకు స్వస్తి

### - టీడీపీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి

జమ్మలమడుగు, మార్చి 16, ప్రభాతవార్త:



రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన ఎన్నికల నోటిఫికేష న్‌తో ముగిసిందని జమ్మలమడుగు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడం వలన దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఇప్పటి నుంచైనా అధికారులు అధికార పార్టీకి అనుగుణంగా కాకుండా పార్టీలకతీతంగా పని చేయాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నేటితో వైసీపీ పాలనకు చరమగీతం పాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కోఆర్డినేటర్లు నల్లంశెట్టి నాగార్జున, దేరంగుల జగదీష్, తెలుగుదేశం, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

## సిరిగేపల్లెలో బాబూ ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ



జమ్మలమడుగు, మార్చి 16, ప్రభాతవార్త: మండలంలోని సిరిగేపల్లె గ్రామంలో బాబూ ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్ర మం నిర్వహించారు. తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్‌రెడ్డి భార్య జ్యోతమ్మ, ఆయన తల్లి సరస్వతమ్మలు పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధు, రామకోటి, గురుప్రసాద్, మల్లికార్జున, కృష్ణయ్య, సుబ్బరాయుడు, కిట్టయ్య, చిన్న సుబ్బరాయుడు, మల్లీ, శంకర్, రామసుబ్బయ్య, తెదేపా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్‌లెవల్-2లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ



మదనపల్లెక్రైం, మార్చి 16 ప్రభాతవార్త : దేశ వ్యాప్తంగా నిర్వ హించిన ఇండి యన్ నేషనల్ టాలెం ట్ సెర్చ్ ఒలంపియాడ్ లెవల్-2లో శ్రీచైతన్య టెక్నో మొదటి బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఐఎన్‌టిఎస్‌ఓ లెవల్-2లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా ఒక్కో విద్యార్థిచొప్పున అందుకొన్నారు. నలుగురు విద్యార్థులు నాలుగవ బహుమతి, ఇద్దరు విద్యార్థులు ఐదవ బహుమతిని, ఇద్దరు విద్యార్థులు ప్రత్యేక బహుమతులు, 72మంది కన్సోలేషన్, 155మంది బంగారు పతకాలు సాధించి మొత్తం 380మంది రెండ లెవల్‌లో మెరిట్ సర్టిఫికెట్స్ సాధించి ప్రభంజనాన్ని సృష్టించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సంస్థ ఏజీఎం సురేష్, ఆర్‌ఐ శ్రీధర్‌లు అభినందించారు. ఈకార్యక్రమంలో డీన్ అనీల్, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ వెంకటేష్, ఒలంపియాడ్ ఇన్‌చార్జ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి వెన్నుముక టిడిపి అభ్యర్థి షాజహాన్



రామసముద్రం, మార్చి 16 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నుముకలాంటివారని వారికి ఏ సమస్య వచ్చిన ముందుండి అండగా నిలబడుతానని నియోజకవర్గ టిడిపి అభ్యర్థి షాజహాన్‌బాషా అన్నారు. మండలంలోని శనివారం మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంనగా విజయకుమార్‌గౌడు మాట్లాడుతూ టిడిపి అభ్యర్థి షాజహాన్‌బాషాకు పూర్తి మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించుకొంటామని హామీఇచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషాను తప్పకుండా గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌నడింపల్లికు చెందిన వాలెప్ప ఇతరులు షాజహాన్‌బాషా సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి మునివెంకటస్వామి, మండల మాజీ అధ్యక్షులు చెంగారెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప, నాయకులు బద్రినాథ్‌శెట్టి, మేస్త్రీ రామచంద్ర, రమేష్, క్రిష్ణప్ప, వేణుగోపాల్, జావిద్, జయప్రకాస్‌నాయుడు, క్రిష్ణమూర్తి, బిజెపి నాయులు ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టిశ్రీరాములు - ఎస్పి



రాయచోటి, మార్చి 16, ప్రభాత వార్త : భారతదేశంలో మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టిశ్రీరాములు అని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. జిల్లా పోలీసఉ ప్రధాన కార్యాలయంలో శనివారం పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భాషాప్రయుక్త, రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్న మహోన్నతుడు అని, ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆంధ్రరాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలు అర్పించిన ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజ్ కమల్, డిపిఓ ఏఓ కృష్ణుడు, సిఐ భాస్కర్, సిఐ చంద్రశేఖర్, సిఐ ఉమామహేశ్వరరావు, ఎంటిఓఎం పెద్దయ్య, ఆర్‌ఐ వెంకట చలపతి, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు అధికారులు, డిపిఓ సిబ్బంది ఘన నివాళులు అర్పించారు.

# పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే సహించం

### మైనార్టీలు వైకాపా అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ వైపేక్షవిలేకర్ల సమావేశంలో మైనార్టీ నాయకులు



మదనపల్లె, మార్చి 16 ప్రభాతవార్త : మైనార్టీ ముస్లింలకు రాజకీయ భిక్ష పెట్టిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే ఉపేక్షించేది లేదంటూ మదనపల్లె మైనార్టీ నాయకులు ముబసిర అహ్మద్, గుండ్లూరు రఫి, లియాఖత్ అలీ, ఇర్ఫాన్‌ఖాన్‌లు తెలిపారు. శనివారం సాయంత్రం వైకాపా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ సమక్షంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మతతత్వ పార్టీ అయిన బిజెపి పొత్తులో భాగంగా మైనార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా షాజహాన్‌బాషా నిలబడడం మైనార్టీలకు తీవ్ర ద్రోహం చేసినట్లేనన్నారు. పదేళ్ళపాటు అన్నదమ్ముల ఇద్దరికి రాజకీయ భిక్ష కల్పించిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించడాన్ని సహించమన్నారు. నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి చేయకుండా సొంత ఆదాయ వనరులను పెంచుకొన్న వారు ఇతరులను విమర్శిస్తే ఉపేక్షించము అన్నారు. నియోజకవర్గంలో మైనార్టీలు అధికశాతం వైకాపా అభ్యర్థి నిస్సార్‌అహ్మద్‌కే మద్దతుగా ఉన్నారన్నారు. ముస్లింలకు తీవ్ర అన్యాయం చేస్తున్న బిజెపితో టిడిపి పొత్తు కలపడం పట్ల ప్రతి ముస్లిం వ్యతిరేకిసున్నారన్నారు. షాజహాన్‌బాషా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. అనంతరం అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ అన్నదమ్ములు ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఉండి మైనార్టీలకు చేసింది శూన్యం అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తనకు ఎమ్మెల్యే టికెట్టు కేటాయించడం జరిగిందన్నారు. ముస్లిలకు వ్యతిరేకంగా ఉన్న బిజెపితో పొత్తుతో పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థికి ముస్లింలే బుద్ధి చెబుతారన్నారు. వైకాపా అధికారంలోకి వస్తేనే ముస్లింలకు అన్ని విధాల లబ్ది చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మెన్ జింకా చలపతి, ఛైర్మెన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, జబ్బల శ్రీనివాసులు, నాయకులు సలీం, రహీం తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో రాయల్‌యూత్ సొసైటి



మదనపల్లె, మార్చి 16 ప్రభాతవార్త : సేవా కార్యక్రమాల్లో రాయల్ యూత్ సొసైటి ముందుంటుందని అధ్యక్షులు రేగడి ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం రాయల్ యూత్ సొసైటి ఆధ్వర్యంలో ఎంఎస్‌ఆర్ థియోటర్ పక్కన ఉన్న రాయల్ సొసైటి కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం, నేత్ర పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. సేవా కార్యక్ర మాలు నిర్వహించడానికి రాయల్ యూత్ సొసైటి ఎప్పుడు ముందుంటు ఒదన్నారు. ప్రతిఏటా ఉచిత వైద్యశిబిరం నియమించడం జరుగుతుందన్నారు. పెద్దసంఖ్యలో యువత రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ యూత్ మహిళా వేల్ఫేర్ సొసైటి గౌరవ అధ్యక్షురాలు ఆర్.కాంతమ్మ, సీనియర్ సిటిజన్ వేల్ఫేర్ సొసైటి అధ్యక్షులు మునిగోపాలక్రిష్ణ, రామచంద్ర, ఉమారాణి, చంద్రశేఖర్, మల్లికార్జున, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి పప్పనపల్లె సర్పంచ్ టిడిపిలోకి చేరిక

### సర్పంచ్ ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి టిడిపిలోకి 50 కుటుంబాలు చేరిక



మైదుకూరు రూరల్, మార్చి 16, ప్రభాతవార్త: మైదుకూరు మండలం పప్పన జపల్లె గ్రామపంచాయతీ పప్పనపల్లె వైయస్సార్‌సిపి సర్పంచ్ మూలే వెంకట లక్ష్మమ్మ, వైయస్సార్‌సీపి నాయకులు మూలే రాజగోపాల్ రెడ్డి, పడిగపాటి నారాయణరెడ్డి, మూలే వెంకట రమణారెడ్డి, మూలే వెంకట్రామ రెడ్డి, మూలే సుబ్బారెడ్డి, పగిటపాటి సుబ్బారెడ్డి, మూలే నాగార్జునరెడ్డి, మూల వెంకతచంద్ర, పిల్లి రాజా, బోనాల వీరంజనేయ ఆచారి, మరియు వారి అనుచర వర్గం వైయస్సార్‌సీపి నుండి తెలుగుదేశం పార్టీలోకి మైదుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరడమైనది. ఈ కార్యక్రమంలో మైదుకూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భీమయ్య, చాపాడు మండల మాజీ అధ్యక్షుడు ద్వారశాల గురిరెడ్డి, చీకిరి వెంకటసుబ్బయచ, జయభారత్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుబ్బారెడ్డి, ఏపీ రవీంద్ర, మేకల బాబు, బి.యస్‌రమణ, నాగమోహన్, ఇస్మాయిల్ భాషా, పాలబాబు, జబంకు ఓబులేసు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు



మదనపల్లె, మార్చి 16 ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని జనసేన నియోజకవర్గ నాయకులు శ్రీరామ రామాంజనే యులు తెలిపారు. శనివారం ఆయన టిడిపి కారక్రమంలో మాట్లాడుతూ జనసేన, బిజెపి, టిడిపి పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థిగా మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా షాజహాన్‌బాషాను ప్రకటించడం జరిగిందన్నారు. ఆయన గెలుపుకోసం జనసైనికులు శాయశక్తులా కృషి చేయాలన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైకాపా ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా గెలిపొందితే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఉమ్మడి అభ్యర్థి గెలుపుకోసం జనసైనికులు అందరూ ప్రణాళిక బద్దంగా పనిచేస్తారన్నారు.

## మదనపల్లెలో ఇంటింటా ఇందిరమ్మ అభయం నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్



మదనపల్లె, మార్చి 16 ప్రభాతవార్త : పట్టణంలోని 11, 12వ వార్డుల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ నాయకులు రెడ్డిసాహెబ్ ఇంటింటా ఇందిరమ్మ అభయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేపట్టే సంక్షేమ పథకాలు గురించి ఇంటింటా తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌పార్టీని ఆదరించి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలో గెలిపించాలన్నారు. ప్రధానిగా రాహుల్‌గాంధీ ఎన్నిక అయితేనే దేశం అన్ని విధాల సుభిక్షంగా ఉంటుందన్నారు. మతతత్వ పార్టీ బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. పొత్తుల పార్టీతోపాటు వైకాపాకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలనపై కూడా ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాద్యక్షురాలు మీనాకుమారి, నాయకులు రవీంద్రరెడ్డి, ముబారక్‌ఖాన్, ఎస్.ఎం.రఫి, పాలేటి, ఈశ్వరమ్మ, షమీం, శరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమ్మె కాలపు హామీలు అమలు జరపాలి

### - జీఓలు తక్షణమే అమలు జరపాలి - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ

రాయచోటి, మార్చి 16, ప్రభాత వార్త : అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయలు వేతనం పెంచుతామని చెప్పిన హామీలు అమలు కోరుతూ 42 రోజుల పాటు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని ఎపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ అసోషియేషన్ ఏఐటియుసి అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలితమ్మ, జిల్లా కన్వీనర్ నాగేశ్వరి డిమాండ్ చేశారు. శనివారం అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ అసోషియేషన్ ఏఐటియుసి అనుబంధ అన్నమయ్య జిల్లా జనరల్ బాడీ సమావేశం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో సరోజమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కె విశ్వనాథ్ నాయక్, ఏఐటియుసి రాయచోటి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, సుజాత, జయలక్ష్మి, అనురాధ, తులసి, దుర్గా, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



## రాజంపేటలో దొంగల భయం

### బండ్రాళ్ల వీధిలో రెండు బంగారు దుకాణాల్లో చోరీ



రాజంపేట అర్బన్ మార్చి 16, ప్రభాతవార్త రాజంపేటలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పట్టణంలో ఎక్కడో ఒక చోట దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేసిన వాటిలో చాలా పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఫిర్యాదు చేయడం లేదు. ఇటీవలే రెండు ఇళ్లలో దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. ఆ సంఘటన నుంచి ఇంకా తేరుకోకముందే తాజాగా శుక్రవారం రాత్రి బండ్రాళ్ల వీధిలోని నజీర్, కరీముల్లాకు చెందిన బంగారు దుకాణాల్లో తెల్లవారుజామున 1.30 గంటలకు ఇనుపరాడ్లతో గేటు తొలగించి దొంగతనాలకు పాల్పడ్డారు. బంగారు దోచుకెళ్లారు. ఇకనైనా అర్బన్ పోలీసులు దృష్టి సారించి దొంగతనాలు అరికట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## జగనన్నను మనసారా ఆశీర్వదించండి



పీలేరు, మార్చి 16 ప్రభాతవార్తః రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనసారా ఆశీర్వదించాలని పీలేరు, కేవి.పల్లె ఎన్నికల ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని బాపూజీ నగర్, మోడల్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలలో అభివద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. అభివద్ధి సంక్షేమం కొనసాగాలంటే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని గెలిపించి రాష్ట్రానికి రెండోసారి జగనన్నను సీఎం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జీవి.రాకేష్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, సాంబశివారెడ్డి, జయచంద్రారెడ్డి, కడప గిరిధర్‌రెడ్డి, చక్రధర్, దావూద్, విజయశేఖర్‌రెడ్డి, తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## జిల్లా వ్యాప్తంగా 3వేల కేసులు పరిష్కారం

కడప లీగల్, మార్చి 16, ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగింది. కడపలో 6, ప్రొద్దుటూరు 4, రాజంపేట 1, రాయచోటి 3, బద్వేలు 2, పులివెందుల, కమలాపురం, జమ్మల మడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, సిద్దవటం, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కొక్క బెంచీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి, శ్రీదేవి మాట్లాడుతూ కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీమతి గీత, సీనియర్ సివిల్ జడ్జీ బాబాఫకృద్దీన్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్, ఎక్సైజ్ కోర్టు జడ్జీ శ్రీమతి హేమా స్రవంతి, 1వ అదనపు జూనియర్, జూనియర్ సివిల్ జడ్జీ శ్రీమతి భార్గవి, 3వ అదనపు సివిల్ జశ్రీమతి విజయలక్ష్మి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

## మౌలాకాపహాడ్ వెల్ఫేర్‌సొసైటీ ఆధ్వర్యంలోకంటిఅద్దాలుపంపిణీ



పెద్దమండ్యం మార్చి 15 ప్రభాతవార్త కలిచెర్లమౌలాకాపహాడ్ వెల్ఫేర్‌సొసైటిచేర్మెన్ ఖాజాస య్యద్‌షా ఆరిఫుల్లా హుస్సేని ఆధ్వర్యంలో శుక్రవారం 120మందికి ఉచితంగా కంటిఅద్దాలు పంపిణీచేయడం జరిగినట్లు మౌలాకాపహాడ్‌సొసైటీకార్య వర్గసభ్యులు బాకీవ ల్లాఖాన్, అమీర్‌సాబ్, గౌస్‌సాహెబ్, అమీన్‌పీర్, ముషీర్‌లు తెలిపారు .గతనెల29న కలిచెర్లమౌలాకాపహాడ్ నందు తిరుపతికిచెందిన శ్రీవెంకటేశ్వరా అరవింద్ వైద్యబృందం ఉచితకంటివైద్య శిబిరం ఏర్పాటచేసిసుమారు వెయ్యిమందికి ఉచితకంటి వైద్యపరీక్షలు చేసినవిషయం తెలి సిందే.అందులో ఆపరేషన్లుచేసిన వారికి కలిచెర్లమౌలాకాపహాడ్ వెల్ఫేర్‌సొసైటీ నిర్వాకులచే ఉచితంగా కంటిఅద్దాలను అందించారు.

## మండల ప్రజల రుణం తీర్చుకునే ఒక్క అవకాశం కల్పించండి: మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



చిన్నమండెం, మార్చి 16(ప్రభాతవార్త): చిన్నమండెం మండల ప్రజల రుణం తీర్చుకునే ఒక్క అవకాశం కల్పించాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని మల్లూరు గ్రామస్తులు పెద్దూరులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరు కాగా కార్యకర్తలు, నాయకులు భారీ గజమాల, బాణసంచాలు, మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి రాయచోటి అసెంబ్లీ స్థానాన్ని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, అలాగే సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరందరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే చిన్నమండెం మండల ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. రాబోయే రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని మీ సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ కార్యకర్తలను కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌ఖయం, మహబూబ్‌బాషా, రెడ్డిబాషా, రాజారెడ్డి, సిద్దయ్య, ఇర్ఫాన్‌బాషా, నాగేంద్ర, రమేష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, నజీర్‌బాషా, జిలాన్, నాగేంద్ర, మండల కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

### - మండల విద్యాశాఖాధికారి పిల్లి నాగరాజు



గాలివీడు, మార్చి 16(ప్రభాతవార్త): ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం అని మండల విద్యాశాఖాధికారి పిల్లి నాగరాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్లకు శిక్షనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో 180 మంది బాలికల ఉన్నత పాఠశాలలో 240 మంది, ఉర్దూ పాఠశాలలో 180 మంది మొత్తం 600 మంది విద్యార్థులు మండల వ్యాప్తంగా పరీక్షలకు హాజరు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 శ్రీనివాసులు, బాలుర, బాలికల, ఉర్దూ పాఠశాలల చీఫ్ సూపరింటెండెంట్లు సుబ్బరాయుడు, దుర్గేశ్వరరాజు, రాధాకృష్ణనాయక్, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయ ప్రతిష్టకు ఏర్పాట్లు పూర్తి: ఈఓ కొండారెడ్డి



గాలివీడు, మార్చి 16(ప్రభాతవార్త): బ్రాహ్మణవీధి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాదాయ శాఖ ఈఓ కొండారెడ్డి పేర్కొన్నారు. శనివారం గాలివీడులో పర్యటించిన ఆయన పెద్దూరు బ్రాహ్మణవీధి శ్రీవారి ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18, 19, 20వ తేదీలలో జరగబోవు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టకు విచ్చేయు భక్తులకు సౌకర్యాలు, పార్కింగ్, అన్నప్రసాదాల వితరణ ఏర్పాట్లపై సమీక్షించారు. 20వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలనుండి పట్టణంలో జరగబోవు ఉత్సవమూర్తుల గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు హరికృష్ణ, వీరారెడ్డి, మణికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది - కలెక్టర్



రాయచోటి, మార్చి 16, ప్రభాత వార్త : ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ఒక గొప్ప త్యాగమూర్తి, భాషాప్రయుక్త రాష్ట్రాల ఆధ్యుడని కొనియాడారు. ఆంధ్రరాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవియైన మహాపురుషుడన్నారు. అటువంటి మహనీయుల జయంతి, వర్థంతిల సందర్భంగా వారి అడుగుజాడలను స్మరించుకుంటూ వారి జీవితం నుండి స్పూర్తి పొంది యువత సన్మార్గంలో దేశ భక్తితో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ సత్యనారాయణరావు, బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, డిపిఆర్‌ఓ పురుషోత్తం, ఆర్‌టిసి ఆర్‌ఎం రాము, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక బద్దంగా చర్యలు

### - కరువు మండలాల్లో ఉపాధి పనుల కల్పనపై ప్రత్యేక దృష్టి - జిల్లా కలెక్టర్



రాయచోటి, మార్చి 16, ప్రభాత వార్త : రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికాబద్దంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి గ్రూఫ్ – 1 పరీక్షలకు సంబంధించిన సూచనలు, ఎన్నికల మోడల్ కోడ్ ప్రవర్తన, ఎంఎస్‌ఎంఇ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీటి ఎద్దడి నివారణ, వైద్య ఆరోగ్యం, జనన, మరణాల నమోదు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కెఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, డిఆర్‌ఓ సత్యనారాయణరావు హాజరైయ్యారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుపరచాలన్నారు. ప్రభుత్వ పథకాలలో ఇప్పటికే ఆమోదం పొంది ప్రారంభించి ఇంకా పూర్తి కాని పనులను పూర్తి చేయాలన్నారు. కొత్త పనులను చేపట్టరాదన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో ఉపాధి పనులను విరివిగా చేపట్టాలని నీటి యాజమాన్య సంస్థ అదికారులకు సూచించారు. ఇప్పటికే ఆమోదం పొందిన సెల్ఫ్ ఆఫ్ గ్రూప్ పనులను ముమ్మరం చేయాలన్నారు. హౌసింగ్‌లో 90 రోజుల పనులు పూర్తి అయిన వాటికి బిల్లులు చెల్లింపు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో సురక్ష క్యాంపులు నిర్వహించాలని, ఈ వైద్య శిబిరాలలో గుర్తించిన రెఫెరల్ రోగులను ఆసుపత్రులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాబోవు ఎన్నికల్లో వైసిపిని ఆధరించండి

### మరింత అభివృద్ధి చేసి చూపిస్తాంఎపిఎమ్‌డిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి



గుర్రంకొండ, మార్చి 16, ప్రభాతవార్త రానున్న ఎన్నికల్లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీని మరోసారి ఆదరిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎపి ఎమ్‌డిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. శనివారం గుర్రంకొండలోని ఆర్టీసి బస్టాండును ప్రారంభించారు. సుమారు రూ. 47 లక్షలతో నిర్మించిన ఆర్టీసి బస్టాండును ప్రారంభించారు. ఈ సంధర్భంగా గుర్రంకొండ సర్పంచ్ డి. జమీర్‌అలీఖాన్, హరీష్‌రెడ్డిలు మాట్లాడుతూ గుర్రంకొండను అన్ని విధాలుగా అబివృద్ది పథంలో నడవాలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముక్తియార్‌అలీఖాన్, సింగిల్‌విండ్ అధ్యక్షులు నక్కా చంద్రశేకర్, ఎంపిపి అప్పల్ల, ఎంపిటిసి ఖధీర్, నూర్, నాయకులు నాయిని శివశంకర్, మండల ఆర్‌బికె అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ఆర్‌బికె డైరెక్టర్ మురాషావలి, రమన తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాను గెలిపిస్తే పీలేరు మరింత అభివృద్ధి

### - నల్లారి తనూజారెడ్డి



కలికిరి, మార్చి 16, ప్రభాతవార్త: తెదేపాను గెలిపిస్తే పీలేరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని పీలేరు నియోజకవర్గం తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి అన్నారు. శనివారం కలికిరి పంచాయతీలోని కె.రెడ్డివారిపల్లి, చిన్నమాలపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తెదేపా మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు. జరగబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తన భర్త నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కలికిరి ఎంపీటీసీ రెడ్డివారి గాయత్రి, కలికిరి సర్పంచ్ ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కలికిరి మండలం టీడీపీ అధ్యక్షులు నిజాముద్దీన్, సీనియర్ నాయకులు కె.సహదేవరెడ్డి, రెడ్డప్పరెడ్డి, వెంకటరెడ్డి, కలికిరి మాజీ ఎంపీటీ శ్యామలమ్మ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మోహన్, మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా అరాచక పాలనకు ఇదే చివరి రోజు

### - టీడీపీ రాష్ట్రష కార్యదర్శి కొండ్రెడ్డి



తంబళ్లపల్లె, మార్చి 16, ప్రభాతవార్త:
రాష్ట్రంలో, తంబళ్లపల్లెలో వైకాపా అరాచక పాలనకు ఇదే చివరి రోజని రాబోయే ఎన్నికల్లో తెదేపా ఘన విజయం తప్పదని తెదేపా రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి తెలిపారు. శనివారం సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల నగారా మోగించడంతో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు క్రాస్ రోడ్డులో బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో తెదేపా అభ్యర్థి జయచంద్రారెడ్డికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఘనసీయమైన మెజార్టీ సాధించి పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమని ఈ అరాచక, దౌర్జన్య పాలనకు ప్రజలు చరమగీతం పాడడం ఖాయమన్నారు. తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నేటి నుంచే ప్రచార పర్వానికి శ్రీకారం చుడతామని ప్రతి కార్యకర్త టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలతో పాటు బీసీ డిక్లరేషన్ ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి, నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షుడు నరసింహులు, సోమశేఖర్, మ్యూజికల్ శివ, రామచంద్రారెడ్డి, కోసువారిపల్లె రవి, నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఏపీఎన్ఆర్టీఎస్ సహకారంతో

## స్వదేశానికి చేరిన బాధితుడు

### - ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్..



కడప కార్పొరేషన్, మార్చి 16, ప్రభాతవార్త: కడప నగరం కుమ్మరకుంటకు చెందిన షేక్ మహ్మద్ రఫీ ఆరు నెలల క్రితం డ్రైవరు పని కోసం కువైట్ వెళ్లారని ఏపీ ఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ బీహెచ్ పేర్కొన్నారు. కువైటీలో (స్పాన్సర్) ఇబ్బందులకు గురి చేయడంతో భరించలేక అక్కడి నుంచి పారిపోయి తెలిసిన వారి దగ్గర తల దాచుకున్నారని తెలిపారు. వీసా తీసిన ఏజెంట్ కూడా పట్టించుకోలేదన్నారు. విషయం తెలుసుకున్న షేక్ మహమ్మద్ రఫీ తల్లి కడప 34వ డివిజన్ ఇన్‌ఛార్జి షేక్ అలీ అక్బర్‌ను కలిసింది. కువైట్ కష్టాల్లో నా కుమారుడు ఉన్నాడని ఇండియా తిరిగి పంపించే మార్గం చూడమని అభ్యర్థించారు. వెంటనే ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి వెంటనే కువైట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, ఏపీఎన్ఆర్టీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ నాయని మహేష్‌రెడ్డికి చేరవేశారు. షేక్ మహ్మద్ రఫీని ఆదుకోవాల్సిందిగా కోరారు. దీంతో మహేష్ భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడారు. షేక్ మహమ్మద్ రఫీపై ఇటువంటి కేసులు లేకుండా చూశారు. ఈ సందర్భంగా ఇలియాస్, బాలిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో అధ్యక్షులు మేడిపాటి ఎస్.వెంకట్ నేతృత్వంలో అనునిత్యం ప్రవాసాంధ్రుల సంక్షేమం సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎన్ఆర్టీఎస్ పని చేస్తోందన్నారు. ఏపీ ఎన్ఆర్టీఎస్ రాష్ట్ర ప్రభుత్వ ఛైర్మన్‌గా ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, సీఈవోగా హేమలత రాణి ఉన్నారని తెలిపారు. షేక్ మహ్మద్ రఫీ తిరిగి ఇండియాకు వెళ్లేందుకు టికెట్ స్నేహితుడు కుటుంబ సభ్యులు భరించారని తెలిపారు. బాధితుడు రఫీ మాట్లాడుతూ తనకు కువైట్ నుంచి ఇంటికి వచ్చినప్పుడు ఏజెంట్ సహా చాలా మంది నీవు మరలా కువైట్ రాలేవని భయపెట్టారు. అక్బర్ లియాస్, బాలిరెడ్డి, మహేష్‌లు చేసిన సహాయంతో నేను ఇండియా వెళ్లగలుగుతున్నానని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవిందు నాగరాజు, పలపుత్తూరు, సురేష్‌రెడ్డి, పోలి గంగిరెడ్డి, సయ్యద్ నజర్ పాల్గొన్నారు.

### పలు గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న

## టీటీపీ పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి గ్రామీణ, మార్చి 16, ప్రభాతవార్త: రాయచోటి పట్టణం కొత్తపేట కె.రామాపురం రోడ్డులో జరుగు మల్లు గంగాధర నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ వేడుకల్లో కొత్తపేట ప్రకాష్ నగర్‌లో దేగల అనిల్ నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ వేడుకల్లో అలాగే పెమ్మాడపల్లె గ్రామం గరుగుపల్లెలో పల్లపు వాసు నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ వేడుకల్లో టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెదేపా నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో నరసింహ స్వామికి పూజలు



గోపవరం, మార్చి 16 ప్రభాతవార్త;
మండలంలోని వల్లెరవారిపల్లెకు సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి పాల్గుణ మాసం శనివారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజాభిషేకాలను నిర్వహించారు. స్వయంభూ అయిన స్వామికి పలు రకాలైన పూల మాలలతో చేసిన అలంకరణను కన్నుల పండుగగా భక్తులు దర్శించుకొన్నారు. ఆలయ పూజారి పెంచలయ్య అందించే సేవల పట్ల ప్రజలు ఆనందోత్సాహాలను వ్యక్తంచేస్తోన్నారు. స్వామి కార్యక్రమం వీడియో ద్వారా సుదూర ప్రాంతాలకు ప్రసారం అయింది. అనంతరం భక్తులకు తీర్ద ప్రసాదాలను పంపిణీ చేసారు. ప్రొద్దుటూరుకు చెందిన కామిశెట్టి సుకుమార్ ధర్మపత్ని సింధుల ఆర్దిక సహకారంతో ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది, గ్రహ చీడ పీడల దోషాలకు గురైన వారికోసం ప్రత్యేక పూజలను నిర్వహించారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 38 కేసులు పరిష్కారం

### ఎనిమిదవ జిల్లా అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి



పీలేరు, మార్చి 16 ప్రభాతవార్త:
స్థానిక కోర్టు ఆవరణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. ఈజాతీయ లోక్ అదాలత్‌లో రెండు బెంచులకుగాను 38 కేసులు పరిష్కారమైనట్లు మెదటి బెంచ్‌లో జడ్జి సుంకర శ్రీదేవి ఎనిమిదవ అదనపు జడ్జి మోటారు వాహనాల కేసులు 8 పరిష్కరించగా రెండవ బెంచ్‌లో జడ్జి కె.రవి సీనియర్ సివిల్‌జడ్జి బెంచ్‌లో 30 కేసులు పరిష్కరించారు. రెండు బెంచ్‌లలో 38 కేసులు పరిష్కారం జరిగింది. ఇరువర్గాలు ఒప్పించి సుమారు 38 కేసులు పరిష్కారం కాగా రూ. 45,25,311 రికవరీ అయినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి కె.రవి, న్యాయవాధులు తెనాలి రామసుబ్రమణ్యం, పీవీ.రమణారెడ్డి , న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, ఇన్సూరెన్సు అడ్వకేట్లు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా గెలుపుకోసం తెదేపాశ్రేణులు ప్రచారం



పీలేరు, మార్చి 16 ప్రభాతవార్తః పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో తెదేపా శ్రేణులు ప్రచారం ఊపందుకుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పట్ణంలోని పట్టణ అధ్యక్షులు దళవాయి సురేష్‌కుమార్‌రెడ్డి అలియాస్ కంచి సూరి తెదేపా కార్యకర్తలతో ప్రచారం చేపట్టారు. పట్టణ అభివద్ది యువత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు , దీపం పథకం కింద గహిణీలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.15వేలు, బీసీలకోసం ప్రత్యేక చట్టం, ప్రతి ఏటా పండుగ కానుకలు పునరుద్దరణ చేయటానికి తెదేపా పార్టీకి ఓటు వేసి కిశోర్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీకర, చెన్నారెడ్డి కాలనీ హరి, రమణ, వెంకటేష్ కాలేషా, వాసు, వెంకీ, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సప్తగిరి గ్రామీణ బ్యాంకు యాజమాన్యం కార్మికుల వ్యతిరేక వైఖరికి నిరసన

పీలేరు, మార్చి 16 ప్రభాతవార్తః
సప్తగిరి గ్రామీణ బ్యాంకు యాజమాన్యం కార్మికుల వ్యతిరేక వైఖరికి నిరసిసూత 26 మార్చి నుంచి దశల వారిగా ఏప్రిల్ 2 నుంచి నిరవదిక సమ్మె నిర్వహిస్తాన్నారు. కార్మికుల సమస్యలుః క్యాజువల్‌ఉద్యోగులను పర్మనెంటు చేయాలి, సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ప్రవేశపెట్టనున్న అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి పిలిచిన టెండర్లు నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని, ఇదివరకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలి, పెండింగ్ ప్రావిడెంట్ ఫండ్‌ను పీఎఫ్ శాఖకు వెంటనే జమచేయాలి, బోనస్‌ను వెంటనే చెల్లించాలనే కోర్కెలు సాదనకోసం ఆందోళన చేపట్టినట్టు యూనియన్ అధ్యక్షులు శివరామ్‌బాబు ప్రధాన కార్యదర్శి రాజేష్‌లు నేడు సంయుక్తంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. పై సమస్యలపై హైకోర్టులో కేసు వేస్తుండగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు యాజమాన్యం కార్మిక చట్టాల నిబంధనలను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని వీరు ఆరోపించారు. బ్యాంక్ క్యాజువల్ ఉద్యోగులు తలపెట్టిన ఆందోలనలకు నిరవధిక సమ్మెకు బ్యాంకు ఖాతాదారులు, కార్మిక, ఉద్యోగ సంఘాలు మద్దతు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశాం

### జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది..

#### - స్టేట్ ఎస్సీ జనరల్ సెక్రటరీ కొర్రపాటి శరత్ బాబు



కమలాపురం, మార్చి 16, ప్రభాతవార్త:
ఏపీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదని స్టేట్ ఎస్సీ జనరల్ సెక్రటరీ కొర్రపాటి శరత్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన స్టేట్ ఎస్సీ జనరల్ సెక్రటరీ పదవి చేపట్టి న అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్ తనపై నమ్మకంతో ఈ పదవి ఇవ్వడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఘన విజయం సాధించి మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి సీఎం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వరుస చోరీలతో మండల వాసులు బెంబేలు

ఖాజీపేట, మార్చి 16, ప్రభాతవార్త: ఖాజీపేట మండల పరిధిలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నెల రోజుల వ్యవధిలో వరుసగా నాలుగు దొంగతనాలు జరిగాయి. తాజాగా ఆంజనేయకొట్టాలు సమీపంలోనిపంట పొలాల్లో దొంగలు బిజ్జం క్రిష్టారెడ్డి అనే రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాఫర్ వైరును దొంగలించారు. గత నెలలో కూడ ఇదే విధంగా పాటిమీదపల్లె సమీపంలో నలుగురు రైతులకు చెందినకరెంటు మోటార్లు, సంబంధించిన వైర్లు కత్తిరించి తీసుకెళ్లారు. అలాగే స్థానికంగా ఉన్న సాయిబాబ గుడిలోని పూజారి గుడికి సంబంధించిన వెండి వస్తువులు, విగ్రహం అపహరించిన ఉదంతం అందిరికి తెలిసిందే. నాలుగురోజుల క్రితం కూడ అదే గుడి ఆవరణంలోని హుండీని పగులగొట్టిన దుండగులు అందులోని నగదును దోచుకువెల్లారు. ఇంత జరుగుతున్నా..వరుస చోరీలపై పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నా ఆరోపణలు లేకపోలేదు. సర్కిల్ స్థాయి అధికారిని నియమించిన వరుస దొంగతనాలు జరగడంపై మండల వాసుల్లో భయం నెలకొంటోంది. ఇప్పటికైన పోలీసులు రాత్రి వేళల్లో గస్తి నిర్వహించి చోరీలు జరగకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.



## యువత ఓటుతోనే దేశ భవిష్యత్తు

### సైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమాలలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



పీలేరు, మార్చి 16 ప్రభాతవార్తః
జిల్లాలోని జేఎన్‌ఈయూ కలికిరి భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూయువ కేంద్ర మరియు జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్‌ఇంజినీరింగ్ కలికిరి సంయుక్త ఆధ్వర్యంలో సైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమంలో జేఎన్‌టీయూ కళాశాల ఆడిటోరియం నందు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ యువత ఓటు హక్కును ఒక్క పండుగగా జరుపుకోవాలని ఎవరికి ప్రలోభ పడకుండా ప్రతి ఒక్కరు వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. కళాశాల విద్యార్థులతో భారత పార్లమెంటు నమూనా దేశంలో జరుగుతున్న అభివద్ది మరియు సంక్షేమం లాంటి వాటిపై వాదోప వాదాలు యువత ఉ్రరూతలూగించాయి. ఉత్తమ ప్రతిభ కనపరిచిన యువతకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలికిరి తహశీల్దారు, జేఎన్‌టీయూ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు మరియు యువత పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు.

## ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిసే మాసం రంజాన్

### - ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి గ్రామీణ, మార్చి 16, ప్రభాతవార్త:
ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిసే మాసం రంజాన్ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలో 2వ రోజు 5, 6 వార్డుల్లోని బడీ కరీమియా మసీదు సమీపంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందు సందర్భంగా స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, మైనార్టీలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి కరీమియా మసీదులో నమాజ్ నిర్వహించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసంలో దైవ చింతనతో పాటు నియమ బద్ధ జీవితం గడపడం వల్ల క్రమశిక్షణ, సానుభూతి, ఓర్పు, సేవాభావం వంటి సద్గుణాలు అలవడతాయని, ఎలాంటి సమస్యలైనా ఎదుర్కొనే ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషా, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహ్మద్‌ఖాన్, ఎస్‌పీ ఎస్ రిజ్వాన్, ఎస్‌పీఎస్ జబీవుల్లా, జాకీర్ హుసేన్, రౌనఖ్ హుసేన్, ఆసిఫ్ అలీఖాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్ తదితర ముస్లిం నాయకులు, మైనార్టీ సోదరులు పాల్గొన్నారుస.

## ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదవాలి

### - విద్య ద్వారా మాత్రమే పేదరిక నిర్మూలన, సామాజిక గుర్తింపు సాధ్యం - శాంతి సేవా సొసైటీ



కడప వైద్యవిభాగం, మార్చి 16, ప్రభాతవార్త: చదువు ద్వారా వచ్చే విజ్ఞానం ఎవరి ఆస్తి కాదని దానిని, దానిని ఎవరు దొంగలించలేరని చదువు నీకు సమాజంలో ఉన్నత గౌరవాన్ని, ఉన్నత పదవుల్ని సంపాదించి పెడుతుందని ప్రతి ఒక్కరూ చదువును ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మడగలం ప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి తస్లీం, స్రవంతి, అమృత, ఎలిజబెత్, హాస్టల్ వార్డెన్లు లీలావతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

### - టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప వైద్యవిభాగం, మార్చి 16, ప్రభాతవార్త: బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పని చేసి జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఆయన తన స్వగృహంలో టీడీపీ, జనసేన బీజేపీ నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిలకలూరిపేటలో ఆదివారం జరిగే ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్, చంద్రబాబు సభకు హాజరవుతున్నామన్నారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జనసేన నాయకులు ఎం శివ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. మాధవి రెడ్డి విజయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన సీతారామ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



ఖాజీపేట, మార్చి 16, ప్రభాతవార్త:
మండల పరిధిలోని పత్తూరు గ్రామంలో శనివారం నాడు సీతా, రామ హనుమ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుప్రక్కల గ్రామల ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## త్వరలో టీడీపీలోకి రావులపల్లె వైసీపీ నేత



ఖాజీపేట, మార్చి 16, ప్రభాతవార్త: ఖాజీపేట మండల పరిధిలోని రావులపల్లెకు చెందిన వైసీపీ నేత గంగవరం ఆదినారాయణ రెడ్డి త్వరలోనే టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని ఆయన తెలిపారు. ఆ నేత టిడిపిలోకి వస్తేరావులపల్లె పంచాయతీలో టిడిపి బలపడనుంది. ఈ వైసీపీ నేతలో కొన్ని రోజులుగా టిడిపి నాయకులు మంతనాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్‌రావులపల్లెలోని ఆదినారాయణ రెడ్డి ఇంటికి చేరుకొని తమ పార్టీలోకి రమ్మని ఆహ్వానించారు. పుట్టా ఆహ్వానానికి సంసిద్ధత తెలిపిన ఆ వైసీపీ నేత త్వరలోనే టిడిపిలో చేరనున్నట్లు తెలుస్తోంది. త్వరలో తన అనుచర వర్గంసుమారు వంద నుంచి రెండు వదలు కుటుంబాలతో భారీ ఎత్తున టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. గతంలో నాగనాధేశ్వర కోన ఆలయ కమిటి ఛైర్మెన్‌గా పనిచేసిన ఆదినారాయణ రెడ్డి(బాబు) టీడీపీలో చేరనుండటంపై మండలంలో పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. ఆ నేత టిడిపి కండువా కప్పుకుంటే దాదాపుగా రావులపల్లె పంచాయతీ టీడీపీ ఖాతాలో జమ అయినట్లే. రావులపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి రాకతో రావులపల్లెలో టీడీపీ మరింత బలపడుతోందని సుధాకర్ యాదవ్ అన్నారు.

## పార్టీ విజయానికి శాయశక్తులా కృషిచేస్తాం



పులివెందుల, మార్చి 16, ప్రభాతవార్త ః రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయానికి శాయశక్తులా కృషిచేస్తామని ఆర్యవైశ్యులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు. శనివారం మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ వరప్రసాద్, తదితరులు ఆర్యవైశ్యులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వస్తే రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్ శ్రేష్ఠి, సభ్యులు కాంభోజి మల్లికార్జున, కంభోజి గంగాధర, పట్టాభి, రామయ్య, పుల్లగూర సుధాకర్, చంద్రమౌళి, దినేష్, రమణ, అయ్యప్ప శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## యువత ఓటుతోనే దేశ భవిష్యత్తు

### - జిల్లా సంయుక్త కలెక్టర్ ఫార్మన్ అహ్మద్‌ఖాన్



కలికిరి, మార్చి 16, ప్రభాతవార్త:
యువత ఓటుతోనే దేశభవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ ఫార్మన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శనివారం కలికిరి జేఎన్‌టీయూ కళాశాలలో భారత ప్రభుత్వ యువజన మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం మరియు జేఎన్‌టీయూ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి జిల్లా సంయుక్త కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాలు యువత నాయకత్వ లక్షణాలుఅలవాటుచేసుకునేందుకఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పండగలా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కలికిరి జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.అపర్ణలు పాల్గొన్నారు.

## నల్లారి తనూజారెడ్డి ఎన్నికల ప్రచారంలో పీలేరు తెలుగు మహిళలు



కలికిరి, మార్చి 16, ప్రభాతవార్త:
కలికిరిలో శనివారం పీలేరు నియోజకవర్గం తెదేపా అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పీలేరుకు చెందిన తెదేపా మహిళా నాయకురాళ్లు అధిక సంఖ్యలో పాల్గొని ఆమెకు మద్దతుగా ఎన్నికల ప్రచారంనిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ తెదేపా మహిళా ఉపాధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో తెదేపా జెండా ఎగురవేస్తామన్నారు. పీలేరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు తెదేపా మహిళా నాయకురాళ్లు రెడ్డమ్మ, చంద్రలేఖ, లక్ష్మీకాంతమ్మ, వనిత, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవం..



కడప కార్పొరేషన్, మార్చి 16, ప్రభాతవార్త: శ్రీచౌడేశ్వరి మాత అందరిని చల్లగా చూస్తుందని భక్తులను కాపాడుతుందని, లోకమంతా సుఖ శాంతులతో ఉంటుందని తొగటవీర క్షత్రియ కుల గురువులు శ్రీ దివ్యజ్ఞానానందగిరి స్వామి అన్నారు. శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి ఉత్సవం 3వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి కాలనీలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జ్యోతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొగట వీర క్షత్రియ కుల గురువులు శ్రీ దివ్యజ్ఞానానందగిరి స్వామి పాల్గొని శ్రీ చౌడేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు కాలనీ పార్కు నుంచి ఊరేగింపుతో బిందె సేవకు శ్రీ విజయ దుర్గాదేవి ఆలయానికి భక్తులు ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు శ్రీ కాలనీలోని పురవీధుల్లో భకస్తులకు కనువిందు చేశాయి. జ్యోతి ఉత్సవాలలో కడప నగర ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు గోవిందునాగరాజు, సీఆర్ఐ సునీల్, పల్లా రాధాకృష్ణ, సంగినాదంఆంజనేయులు, కొరముట్లపెద్ద సుబ్బరాయుడు, ఇట్టే వేణ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సీ పరీక్షల పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 16, ప్రభాతవార్త : ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు పర్యవేక్షణ కట్టుదిట్టంగా ఉండాలని ఫ్లయింగ్ స్క్వాడ్ సమావేశంలో ఎస్ఎస్‌సీ పరీక్షల జిల్లా పర్యవేక్షణ అధికారి జేడీ సర్వీసెస్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి మర్రెడ్డి అనురాధ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ పరీక్షల ఫ్లయింగ్ స్క్వాడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కొక్కరికి కేటాయించిన ప్రతి పాఠశాలను పరీక్ష సమయంలో తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలని ఎక్కడైనా ఎటువంటి ఘటనలకు చోటు లేకుండా పరీక్షలు నిర్వహించే విధంగా చూడాలని ఆదేశించారు. ఏవైనా సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా విద్యాశాఖాధికారికి అలాగే పరీక్షల పర్యవేక్షణ అధికారికి వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. పరీక్ష సమావేశంలో కేటాయించిన పాఠశాలలకు పర్యవేక్షణ చేసేటప్పుడు ఎక్కడైనా కాపీ, మాస్ కాపీ జరిగినట్లయితే వెంటనే సంబంధిత చీఫ్, డిపార్ట్‌మెంట్ ఇన్విజిలేటర్లు పైనా చర్యలు తప్పవని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్

### - త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి - ఎంసిసి నిబంధనలు తప్పక పాటించాలి - జిల్లా కలెక్టర్

రాయచోటి, మార్చి 16, ప్రభాత వార్త :
త్వరలో జరగబోయే 2024 సాధారణ ఎన్నికలు అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు 2024 సాధారణ ఎన్నికల నిర్వహణపై ఎస్పీ కృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ఛాలెంజ్‌గా తీసుకొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన రోజు నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఎంసిసి నిబంధనలు పాటించాలన్నారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిం దని, ప్రతి ఒక్కరు ఈ ఎన్నికలకు సహకరించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



